సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



అదును చూసి చోరీ

బ్యాంకుల వద్ద నిఘా వేస్తారు.. డబ్బులు డ్రా చేసుకుని వెళ్లేవారిని వెంబడించి సొమ్ము కాజేస్తారు. ఈ దొంగల ముఠాను ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. 8లో ▸



రోప్ స్కిప్పింగ్ విజేతగా డీఎన్నార్

డీఎన్నార్ కళాశాలలో నిర్వహించిన నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల రోప్ స్కిప్పింగ్ పురుషుల విభాగంలో డీఎన్నార్ కళాశాల చాంపియన్‌గా నిలిచింది. 8లో ▸



ఈదురుగాలులతో బెంబేలు

ఏలూరుతో పాటు ఏజెన్సీ, నూజివీడు, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో మంగళవారం భారీ ఈదురుగాలులు వీచాయి. ఉద్యాన పంటలకు నష్టం ఏర్పడింది. 8లో ▸

న్యూస్‌రీల్

వైభవంగా క్షీరారామలింగేశ్వర స్వామి కల్యాణం



క్షీరారామలింగేశ్వరస్వామి కల్యాణం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి సమేత క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీ సమేత శ్రీ జనార్ధనస్వామి సప్తాహ్నిక కల్యాణం వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి జరిగిన కల్యాణోత్సవంలో ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. భమిడపాటి వెంకన్న, సూరిబాబుల బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు కిష్టప్ప, వీరబాబు, అనిల్, పూర్ణయ్య కల్యాణ తంతును నిర్వహించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి, బ్రాహ్మణపురోహితస సంఘం నుంచి పట్టు వస్త్రాలు సమర్పించారు. దాతలు కంచర్ల రామారావు, నాని, గౌరి కుటుంబ సభ్యులు భక్తులకు లడ్డూ ప్రసాదం, గాదె సుబ్బారావు దంపతులు గిఫ్ట్ ఆర్టికల్స్ పంపిణీ చేశారు. వేకువజామునుండే భక్తులు ఆలయానికి వచ్చి కల్యాణం తిలకించారు. సాయంత్రం రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

జేఈఈ మెయిన్స్‌కు 97 మంది హాజరు

భీమవరం: భీమవరం డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 100 మంది విద్యార్థులకు 97 మంది హాజరయ్యారని పరీక్షల పర్యవేక్షకుడు బి.సూర్యనారాయణమూర్తి చెప్పారు.

ఎట్టకేలకు మరమ్మతులు



ఆగిరిపల్లి నుంచి తోటపల్లి వరకు పూర్తయిన రహదారి మరమ్మతులు

సాక్షి స్పందన

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి నుంచి తోటపల్లి రహదారికి ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేశారు. 9 నెలల క్రితం ఆగిరిపల్లి నుంచి తోటపల్లి వరకు పాత రోడ్డును తొలగించి కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనదారులు, ప్రజలు రోడ్డుపై లేచిన కంకరరాళ్లతో, దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత నెల మార్చి 5న 'కంకర రోడ్డుపై కష్టాలు' పేరిట సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆగిరిపల్లి నుండి తోటపల్లి వరకు రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారపుపేట వీవర్స్ కాలనీలో ధర్నా నిర్వహించారు. ధర్నా ఉద్దేశించి జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమను రక్షిస్తామని వాగ్దానం చేసినా నేటికీ అమలు చేయలేదన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరారు. నేతన్న నేస్తం మగ్గం నేస్తున్న ప్రతి కార్మికుడికి ఇవ్వాలని... బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలని కోరారు. చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సహకారం చేయాలని.. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ బోర్డు ఏర్పాటు చేయాలని, సహకార సంఘాల అప్పులు రద్దు చేయాలని, ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు.

సిలిండర్‌పై అదనపు భారం తగ్గించాలి

ఏలూరు (టూటౌన్): సిలిండర్ ధరను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఏలూరు కమిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్, అంబేద్కర్ బొమ్మ వద్ద మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించారు. వంటగ్యాస్‌పై రూ.50 భారం మోపడాన్ని నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ ప్రసాద్, వైఎస్ కనకారావు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత గ్యాస్ సిలిండర్లపై కూడా భారం పడుతుందని చంద్రబాబు వెంటనే దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నందున చంద్రబాబు జోక్యం చేసుకొని ధరను తగ్గించేలా మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీల అమలులో ఘోరంగా విఫలమయ్యారని.. సూపర్ సిక్స్ అంటూ మోసపూరిత హామీలు ఇచ్చి నేడు ప్రజలను చావుదెబ్బ తీశారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. రాష్ట్రంలో ఇటీవల కొన్ని పచ్చ మీడియా పత్రికలు రాష్ట్రం అభివృద్ధి చెందిందంటూ కథనాలు రాస్తున్నాయని, నిజంగా అభివృద్ధి చెందితే మీకు రూ.15 వేలు.. మీకు రూ.15 వేలు.. అంటూ ఎన్నికల హామీలు ఇచ్చారు కదా.. వాటిని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించే దమ్ముందా అని నిలదీశారు. ఏలూరు మినీ బైపాస్‌లోని క్రాంతి కల్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యకర్తలు, నేతల ఆత్మీయ సమావేశం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఆత్మీయ సమావేశానికి పార్టీ నేతలు, శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



ఏలూరులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ జిల్లా ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, వేదికపై ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, మాజీ మంత్రి కారుమూరి, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు వాసుబాబు, ప్రతాప అప్పారావు, నియోజకవర్గ ఇన్‌చార్జులు జయప్రకాష్, విజయరాజు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ తదితరులు

హామీల అమలులో హ్యాండ్సప్

- సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు నిధులు లేవంటున్నారు
- మీకు రూ.15 వేలు.. మీకు రూ.15 వేలు హామీలు అమలు చేశారా?
- గ్యాస్‌పై రూ.50 పెంపు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ధ్వజం
- పేదలు చదవకూడదనే ఇంగ్లిష్ మీడియం ఎత్తేశారు: కారుమూరి
- నాలుగేళ్ళు ఓపిక పడితే భవిష్యత్ మనదే: డీఎన్నార్
- ఏలూరు సమీపంలో వైఎస్సార్‌సీపీ నేతల, కార్యకర్తల ఆత్మీయ సమావేశం
- భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఏలూరు టౌన్/ పెదపాడు: ఏలూరులో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జై జగన్ నినాదాలతో మార్మోగింది. ఈ సభలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్క పింఛన్ తప్ప ఏదీ అమలు చేయలేదని, ప్రజలను దారుణంగా మోసం చేశారని విమర్శించారు. సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం చంద్రబాబు నేడు డబ్బులు లేవని కుంటి సాకులు చెబుతూ సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గత ఐదేళ్లలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారని తెలిపారు. సీఎం చంద్రబాబుకు వ్యవసాయం అంటే దండగ అనే అభిప్రాయం ఉందనీ, అందుకే రైతన్నల నడ్డి విరిచేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కేంద్రం సిలిండర్ ధర రూ.50 పెంచితే .. ఆ భారం ప్రజలపై పడకూడదనే ఉద్దేశంతో ఆ భారాన్ని సబ్సిడీగా అందించారని,, ఈ రోజు కూటమి ప్రభుత్వం కేంద్రం పెంచిన గ్యాస్ సిలిండర్ భారాన్ని భరించేందుకు సిద్ధమేనా అంటూ నిలదీశారు. కొల్లేరు ప్రాంత ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకునేందుకు కూటమి నేతలు ఎవరైనా వెళ్లారా ? అంటూ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీలో ఒక్కో కార్యకర్త.. ఒక్కో క్రియాశీలక నాయకుడని, కార్యకర్త ఫోన్ చేస్తే ఏ సమయంలోనైనా మాట్లాడేలా ఉండాలని సమన్వయకర్తలకు సూచించారు. ఆత్మీయ సమావేశంలో ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథం, బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మేకా లక్ష్మణరావు, పాత్తూరి శ్రీనివాసరాజు, జగ్గవరపు జానకిరెడ్డి, మంతెన సోమరాజు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరసింహారావు, కందులపాటి శ్రీనివాసరావు, ఎస్‌కే సయ్యద్‌బాజీ, జిల్లా అధికార ప్రతినిధులు మున్నల జాన్‌గురునాథ్, కత్తుల రవికుమార్, మోట్రు అర్జున్‌రావు, కంచర్ల లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభంజనం మళ్లీ మొదలు: కోటగిరి



ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ... ఈ రోజు నుంచి ఏలూరు జిల్లాలో మళ్లీ జగనన్న ప్రభంజనం ప్రారంభమైందన్నారు. ఆత్మీయ సమావేశానికి యువత మాత్రమే కాకుండా పార్టీ పెద్దలు, నాయకులు హాజరయ్యారని.. మీ కళ్లలో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలనే కసి కనిపిస్తోందని చెప్పారు. సమష్టిగా ప్రజల కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

గ్యాస్ ధర పెంచితే ప్రశ్నించరా: సునీల్ కుమార్



ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలో కూటమి ప్రభుత్వం భాగస్వామిగా ఉందని, కేంద్రం గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచిందని, ప్రజలను ఆదుకునేందుకు ఏమి చేస్తారో చెప్పాలని నిలదీశారు. కేసులు పెట్టటం, జైళ్లలో పెట్టటం, పోలీసులతో వేధింపులకు గురిచేయటమే కూటమికి తెలిసిన పాలన అంటూ ఎద్దేవా చేశారు.

బాబుకు కళ్లు తిరిగాయి: కారుమూరి



మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఇటీవల సీఎం చంద్రబాబు వైఎస్సార్‌సీపీ హయాంలో కట్టించిన స్కూల్‌కు వెళ్లారని.. అక్కడ పిల్లలు ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే చంద్రబాబుకు కళ్లు తిరిగాయని ఎద్దేవా చేశారు. గతంలో జగన్ ఒక్కరే హెలికాప్టర్‌లో సభలకు వెళ్తే.. నేడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ సైతం హెలికాప్టర్‌లో తిరుగుతున్నారని, ప్రజాధనం ఇప్పుడు దుర్వినియోగం అవ్వదా ? అంటూ నిలదీశారు. పేదలు పెద్ద చదువులు చదవకూడదనే ప్రభుత్వ స్కూళ్లలో అమలు చేస్తున్న ఇంగ్లిష్ మీడియాన్ని ఎత్తేశారని విమర్శించారు.

ఆరోగ్యశ్రీ నిర్వీర్యం చేసే కుట్ర: డీఎన్నార్



వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నాలుగేళ్ళు ఓపిక పడితే భవిష్యత్ అంతా మనదేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కూటమి పాలనలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

సంక్షేమం, అభివృద్ధిలో స్ఫూర్తి: జేపీ



ఏలూరు నియోజకవర్గం సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ .. గత ఐదేళ్ల పాలనతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధితో ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి ప్రజాభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు.

రాజీనామా చేసి వెళ్లాలి: ప్రతాప అప్పారావు



నూజివీడు సమన్వయకర్త మేకా ప్రతాప అప్పారావు మాట్లాడుతూ.. గ్రామాల్లోకి వెళితే జగనన్నకు దూరం కావటం పట్ల తీవ్ర ఆవేదన, బాధ వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మళ్ళీ అధికారం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీని వీడేవారు దమ్ముంటే పదవులకు రాజీనామాలు చేసి వెళ్ళాలని సవాలు విసిరారు.

తాటాకు చప్పుళ్లకు భయపడం: బాలరాజు



పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం బాలరాజు మాట్లాడుతూ.. రెడ్ బుక్ మీకే కాదనీ... మాకూ ఉంటుందని, కూటమి నేతల తాటాకు చప్పుళ్ళకు భయపడేది లేదన్నారు. కూటమి నేతలు దోపిడీలకు అలవాటు పడ్డారని, ఇసుక, మట్టి మాఫియాతోపాటు ఏది దొరికితే అది దోచుకోవటమే పనిగా పెట్టుకున్నారన్నారు.

10 నెలల్లోనే ప్రజా వ్యతిరేకత: వాసుబాబు



ఉంగుటూరు సమన్వయకర్త పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇంత త్వరగా 10 నెలల్లోనే ప్రజా వ్యతిరేక మూటగట్టుకోలేదన్నారు. గత పాలనలో మెడికల్ కాలేజీలు కడితే వాటిని ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు


ప్రభుత్వానికి హెచ్చరిక: విజయరాజు



చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు మాట్లాడుతూ.. ఈ రోజు ఏలూరులో పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంతోనే మొదటి అడుగు పడిందని ఇది కూటమి ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా నిలుస్తుందన్నారు.

పేదల నెత్తిన ధరల బండ

- రూ.50 పెరిగిన గ్యాస్ ధర
- జిల్లాలో 42 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 6,21,626 కనెక్షన్లు
- జిల్లా వాసులపై రూ.21.76 కోట్ల అదనపు భారం
- ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో ఇక్కట్లు



జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు	
6,21,626	
జనరల్ కనెక్షన్లు	ఉజ్వల కనెక్షన్లు
4,02,335	27,420
దీపం కనెక్షన్లు	సీఎస్ఆర్ కనెక్షన్లు
1,83,183	8,528
5 కేజీల కనెక్షన్లు : 160	

సాక్షి, భీమవరం: సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న నిత్యావసరాల ధరల చెంతన వంట గ్యాస్ చేరింది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో మంగళవారం నుంచి సిలిండర్ ధర రూ.50 పెరిగి మంటలు పుట్టిస్తోంది. ఎన్డీఏ సర్కారు పెంచిన ధరతో జిల్లాలోని వినియోగదారులపై ఏడాదికి రూ.21.76 కోట్ల అదనపు భారం పడుతోంది. జిల్లాలో ఐఓసీకి చెందిన 20 గ్యాస్ ఏజన్సీలు ఉండగా హెచ్‌పీసీ ఏజెన్సీలు 18, బీపీసీ ఏజెన్సీలు నాలుగు ఉన్నాయి. వీటి పరిధిలో 6,21,626 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నిన్నటి వరకు 14.20 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.830గా ఉంది. వంట గ్యాస్‌పై మంగళవారం నుంచి రూ.50 పెంచుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. జనరల్ కనెక్షన్లతో పాటు ఉజ్వల కనెక్షనకు ఈ పెంపు వర్తిస్తుంది. ఈ మేరకు సిలిండర్ ధర రూ.880కు పెరిగింది. సగటున ఒక్కో కుటుంబం ఏడాదికి ఏడు సిలెండర్ల చొప్పున వాడుతోంది. జిల్లాలోని వినియోగదారులు 43.51 లక్షల డొమెస్టిక్ సిలెండర్లు వినియోగిస్తున్నట్టు అంచనా. వంట గ్యాస్ కోసం ఇంతవరకు ఏడాదికి రూ.5810 వెచ్చిస్తే, ప్రస్తుత ధర ప్రకారం రూ.6,160 చెల్లించాలి. పెరిగిన ధరల ప్రకారం జిల్లా వాసులపై రూ.21.76 కోట్ల అదనపు భారం పడుతోంది.

పేదింట ధరల మంట : మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. కిలో కందిపప్పు రూ.150గా ఉంటే పెసరపప్పు రూ.130, మినపప్పు రూ.110గా ఉంది. మరోపక్క పామాయిల్ ప్యాకెట్ రూ.140 ఉండగా, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.150గా ఉంది. జనవరిలో రూ.120 ఉన్న పామాయిల్ ఫిబ్రవరిలో రూ.20 పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. ఇతర నూనెలు, సరుకుల ధరలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం రేషన్ కందిపప్పు సరఫరా మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. రెండు నెలలుగా సరఫరా నిలిపివేయడంతో అధిక ధరలకు బయటి మార్కెట్‌లోనే కొనుగోలు చేయాల్సి వస్తోంది. సంక్షేమ పథకాల అమలును గాలికొదిలేసిన ప్రభుత్వం, ధరల నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో పేదవర్గాల జీవనం దుర్భరంగా మారింది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు తాజాగా వంటగ్యాస్ ధర పెరగడం ఆందోళనకు గురిచేస్తోంది. సిలిండర్‌పై కేంద్రం ఇస్తున్న సబ్సిడీ రూ.10 మాత్రమే. పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని వివిధ వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గ్యాస్ ధర పెంపు సరికాదు



కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో వంట గ్యాస్ ధరలు పెంచడం సరికాదు. దీనివలన ప్రజలపై మరింత భారం పడుతుంది.

– కొల్లి రత్నకుమారి, గృహిణి, ఉండి

పెంచిన ధరను తగ్గించాలి



పేదవాడిపై భారం పడకుండా నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని ఎన్నికల్లో చెప్పి ఇప్పుడు ఇష్టానుసారంగా అన్ని ధరలూ పెంచేస్తున్నారు. పెంచిన ధరలను తగ్గించి పేదవర్గాల వారిని ఆదుకోవాలి.

– చాలంటి సజన, ఎస్ఆర్పీ అగ్రహారం

ఆక్వా రంగం నిర్వీర్యం



భీమవరంలో మాట్లాడుతున్న రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి నాయకులు

భీమవరం: అమెరికా పన్నుల పేరుతో రొయ్యల ధరలు గణనీయంగా తగ్గించి ఆక్వా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం భీమవరంలో విలేకర్ల సమావేశంలో సమితి నాయకులు మాట్లాడారు. ఇటీవల అమెరికా విధించిన సుంకాల వల్ల రొయ్యల పరిశ్రమ పూర్తిగా సంక్షోభంలో పడిపోయిందన్నారు. మన రాష్ట్రం నుంచి అమెరికాకు కేవలం 20 నుంచి 40 కౌంట్ రొయ్యలు మాత్రమే ఎగుమతవుతాయని, అయితే అన్ని కౌంట్ రొయ్యల ధరలు తగ్గించడం విడ్డూరంగా ఉందన్నారు. మేతల తయారీకి ఉపయోగించే సోయాబీన్, మొక్కజొన్న వంటి ధరలు తగ్గినా మేతల ధరలు మాత్రం తగ్గడం లేదని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సమితి గౌరవాధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ ఆక్వా రంగంపై సుమారు 60 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని, పారిశ్రామిక రంగంతో సమానంగా ఆక్వా రంగానికి రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ తమ్మినీడి నాగేశ్వరావు మాట్లాడుతూ ఇటీవల నాణ్యమైన రొయ్యల సీడ్ దొరక్క ఎంతో మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు తప్పనిసరై తక్కువ ధరకు రొయ్యలు విక్రయించాల్సివస్తోందన్నారు. సమావేశంలో సహాయ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, నీటి సంఘం ఉపాధ్యక్షుడు కోళ్ల సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా అధికారులతో శాఖల వారీగా మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షిస్తున్నా.. ఫలితం ఉండడం లేదన్నారు. పంచాయతీరాజ్, గృహనిర్మాణం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలలో ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత అధికారులు ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులకు నోటీసు ఇవ్వకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా ఫిర్యాదులు ముగించరాదన్నారు. ఫిర్యాదుదారు సంతృప్తి పడేలా సమస్య పరిష్కారం కావాలన్నారు. గడువులోపుగా పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ నుంచి సిబ్బంది ఆయా అధికారులకు ఫోన్ చేసి చెబుతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోప్ స్కిప్పింగ్‌లో చాంపియన్‌గా డీఎన్నార్ కళాశాల



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అంతర్ కళాశాలల రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పురుషుల విభాగంలో డీఎన్నార్ కళాశాల, మహిళల విభాగంలో రాజమహేంద్రవరం కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల ఛాంపియన్లుగా నిలిచాయి. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వీవీ నర్సింహరాజు మాట్లాడుతూ చాంపియన్‌షిప్ సాధించిన టీమ్‌లు ఈ నెల 22వ తేదీ నుంచి మూడు రోజులపాటు రాజస్తాన్‌లోని పిండ్వారాలో నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన డీఎన్నార్ విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు జీవీ నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు జి పాండు రంగరాజు, ప్రిన్సిపాల్ జి మోజెస్ అభినందించారు. విజేతలకు కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ ఆర్ రామకృష్ణంరాజు బహుమతులు అందజేశారు.

సీఎస్ఆర్ నిధులతో పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పలు కంపెనీల నుంచి జిల్లాకు మంజూరైన సీఎస్ఆర్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ నాగరాణి సీఎస్ఆర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీఎస్ఆర్ నిధుల ద్వారా కమ్యూనిటీ హాళ్లు, రోడ్లు, రోడ్ కమ్ డ్రెయిన్లు, డయాలసిస్ యూనిట్లు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి దత్తత గ్రామమైన పీఎం లంకలో పీఎం సూర్యగర్ పథకం ద్వారా 100 ఇళ్లకు సోలార్ ప్యానల్స్ అమరిక, తదితర పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. బెల్ కంపెనీ రూ.70 లక్షలు, ఎన్ఎండీసీ రూ.8.60 కోట్లు, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ రూ.2.50 కోట్లు సీఎస్ఆర్ నిధుల కింద జిల్లాకు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధుల ద్వారా వివిధ శాఖల ఆధ్వర్యంలో గుర్తించిన పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కంటిపూడి శ్రీనివాసరావు, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ గీతాబాయి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పి సూర్యనారాయణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ రఘునాథ బాబు, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, ఏపీఎంఐడీసీ ఈఈ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో బెంబేలు

- ఏజెన్సీలో గాలి, వాన బీభత్సం
- మెట్టలో అకాల వర్షాలు
- డెల్టాలో ఉద్ధృతంగా ఈదురుగాలులు



పెంటపాడు: అలంపురం, ప్రత్తిపాడు గ్రామాల్లో కారుమబ్బులు కమ్మి ఈదురుగాలులు వీస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: పందిరిమామిడిగూడెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



కొయ్యలగూడెం: గవరవరంలో ఎగిరిపడిన వర్జీనియా బేరన్ల పైకప్పులు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం లీలాలమ్మ గుడి వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



చింతలపూడి: పట్టాయిగూడెంలో పడిపోయిన అరటి తోట



బుట్టాయగూడెం: డిగ్రీ కళాశాల వద్ద ఆటోపై విరిగిపడిన చెట్టు కొమ్మలు

ఏలూరు(మెట్రో): వాతావరణం ప్రజలతో దోబూచులాడుతోంది. పగలు ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకుంటూ ప్రజలను భానుడు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, సాయంత్రం సమయానికి వరుణుడు కాస్త చల్లబరుస్తున్నాడు. దీనికి ఈదురుగాలులు సైతం తోడవుతున్నాయి. మంగళవారం ఏలూరుతో పాటుగా ఏజెన్సీ ప్రాంతం, అదేవిధంగా నూజివీడు, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులు భారీగా వీచాయి. వీటితో పాటుగా అక్కడక్కడ చిరుజల్లులు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గత నాలుగు రోజులుగా ఇదేవిధంగా వాతావరణం మారుతుండటంతో పగలు ఎండ వేడికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నా, సాయంత్రం చల్లని గాలులలకు కాస్త సేదదీరుతున్నారు.

గాలి, వాన బీభత్సం

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన గాలి, వాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండలు ఉండగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కారుమబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు ధాటికి పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. బుట్టాయగూడెం రాజానగరం కాలనీ ఎదురుగా చెట్టు కూలడంతో వాహనాలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. డిగ్రీ కళాశాల సమీపంలో జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం వస్తున్న ఆటోపై చెట్టు కూలగా డ్రైవర్‌కు స్వల్పగాయమైంది. గుబ్బల మంగమ్మ గుడి, పందిరిమామిడిగూడెం, అంతర్వేదిగూడెం, దొరమామిడి, అలివేరు, లంకపాకల, రేపల్లె, రేగులపాడు, పులిరామన్నగూడెం, బుట్టాయగూడెం, మర్లగూడెం, తదితర గ్రామాల్లో సుమారు 2 గంటలసేపు భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అకాల వర్షాలతో పొగాకు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కేఆర్‌పురంలో డి.రాజు అనే వ్యక్తికి చెందిన తాటాకిల్లు కూలిపోయింది.

ఉద్యాన పంటలకు నష్టం

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలులకు ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. యర్రంపల్లి, పట్టాయిగూడెం, రేచర్ల గ్రామాల్లో అరటి చెట్లు నేలకొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలు నేలరాలాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం రాత్రి నుంచి మంగళవారం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పొగాకు బేరన్లు ధ్వంసం

కొయ్యలగూడెం: గాలివాన ఉధృతికి గౌరవరం గ్రామంలో రైతులకు చెందిన ఆరు వర్జీనియా పొగాకు బేరన్లు ధ్వంసం అయ్యాయి. పై కప్పులు ఎగిరి దూరంలో పడ్డాయి. బయ్యనగూడెంలో గాలి ఉధృతికి మామిడికాయలు నేలరాలాయి. కన్నాపురం సమీపంలో ఈదురు గాలులకు చెట్లు విరిగిపడడంతో పోలవరం రోడ్డు బుట్టాయిగూడెం రోడ్డులో రాకపోకలు స్తంభించాయి.

నేలకొరిగిన వరిచేలు

ఆకివీడు: మంగళవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులు వీచడంతో చెట్లు నేలకొరిగాయి. పలు చోట్ల వరిచేలు నేలకొరిగాయి. వర్షం పడుతుందేమోనని రైతులు ఆందోళన చెందారు. ఈదురుగాలుల ధాటికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఒక్కసారిగా మారిన వాతావరణం

పెంటపాడు: ఉన్నట్టుండి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అప్పటివరకు ఉక్కబోత, ఎండ తీవ్రతతో అల్లాడగా మంగళవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీచడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మరో వైపు వరి కోతలు మాసూళ్లు చేపడుతున్న రైతులను కారుమబ్బులు కలవరపెట్టాయి. పంట పక్వానికి వచ్చిన తరుణంలో మారుతున్న వాతావరణ పరిస్థితులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి.

ఈదురుగాలులతో వర్షం

జంగారెడ్డిగూడెం: పట్టణం, మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులు అధికంగా రావడంతో సుమారు 2 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గుర్వాయిగూడెం లీలాలమ్మ గుడి వద్ద గాలివానకు భారీ చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆ చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వడగండ్ల వర్షం

కుక్కునూరు: కుక్కునూరు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. చిరవెల్లి, రెడ్డిగూడెం, ఉప్పేరు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవగా ఇతర గ్రామాల్లో మోస్తరుగా పడింది. ఈదురుగాలుల ధాటికి జంగారెడ్డిగూడెం నుంచి వచ్చే విద్యుత్ లైన్‌పై చెట్లు పడడంతో మండలంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వారం రోజుల్లో కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు



బర్త్ కంట్రోల్ ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీ నాగ నరసింహారావు

పాలకొల్లు సెంట్రల్: వారం రోజుల్లో వీధి కుక్కలకు నిర్వహించే యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్ చేసే థియేటర్లు, కెనాల్స్ పనులు పూర్తిచేయాలని రీజనల్ డైరెక్టర్, అప్పిలేట్ కమిషనర్ రాజమండ్రి సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. మంగళవారం స్థానిక యడ్లబజారు సెంటర్ పెనుమదం రోడ్డులో ఉన్న వెటర్నరీ ఆసుపత్రిలో నిర్మించిన యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్ థియేటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీ నాగ నరసింహారావు మాట్లాడుతూ కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు నిర్వహించే థియేటర్లు, కెనాల్స్ పూర్తి చేసి వారం రోజుల్లో ఆపరేషన్లు ప్రక్రియ ప్రారంభించాలని మునిసిపల్ కమిషనర్ బి విజయసారధికి సూచించారు. రాజమహేంద్రవరం రీజనల్ పరిధిలో ఉన్న అన్ని పురపాలక సంఘాల్లో యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు నిర్వహించుటకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, డీఈఈ కె రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం

యలమంచిలి: మొగల్తూరు మండలం కొత్తకాయలతిప్ప గ్రామానికి చెందిన లక్కు శేఖర్ (21) మృతదేహం గోదావరిలో లభ్యమైనట్లు ఎస్సై కర్రీడి గుర్రయ్య తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వచ్చిన శేఖర్ ఆదివారం సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి చించినాడ వంతెన మీద నుంచి గోదావరిలోనికి దూకుతున్నట్లు చెప్పాడు. దీంతో అతని తండ్రి వీరాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శేఖర్ కోసం గోదావరిలో గాలించగా మంగళవారం బాడవ గ్రామం వద్ద మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు. మృతదేహానికి శవ పంచనామా, పోస్టుమార్టం పూర్తి చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా నిర్వహించి, గోనె సంచులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, సహకార, వ్యవసాయ, రవాణా, అసిస్టెంట్ కంట్రోల్ లీగల్ మెట్రాలజీ, అగ్రికల్చర్ ట్రేడ్ మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మిల్లుల నుంచి సేకరించిన గోనెసంచులు క్వాలిటీతో ఉండాలని అన్నారు. చిరిగిన సంచులు ఏమైనా ఉంటే వెంటనే పరిశీలించి వాటి స్థానంలో కొత్త సంచులను తీసుకోవాలన్నారు. మండలాల వారీగా గిడ్డంగులు, ఆర్ఎస్‌కేలలో గోనే సంచులను చేర్చి భద్రపరచాలన్నారు. ఏ ఒక్క రైతు నుంచి గోనెసంచులు అందడం లేదనే ఫిర్యాదు రాకూడదన్నారు. ట్రక్ షీటు జనరేట్ అయిన వెంటనే రైతుల నుంచి వేలిముద్ర తీసుకొని ఈకేవైఎస్ నమోదు చేయాలని, అప్పుడే రైతుల ఖాతాల్లో డబ్బులు జమకు వీలవుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 43 రైతు సేవ కేంద్రాల ద్వారా 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే జిల్లా కంట్రోల్ రూమ్ 81216 76653 తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజు, జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారి సునీల్, అసిస్టెంట్ కంట్రోల్ లీగల్ మెట్రాలజీ నాగ రాజారావు, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అరకొర రుణాలు.. అధిక సంఖ్యలో దరఖాస్తులు



బీసీ రుణాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలో దరఖాస్తుదారులతో కిక్కిరిసిన కౌన్సిల్ హాల్

కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలను అరకొరగా మంజూరు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. బీసీ కార్పొరేషన్ కింద నూజివీడు పట్టణానికి మంజూరైన సబ్సిడీ యూనిట్ల కోసం మంగళవారం బ్యాంకర్లు స్థానిక కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో రావడంతో కౌన్సిల్ మీటింగ్‌హాల్ కిక్కిరిసిపోయింది. పట్టణానికి 102 యూనిట్లు మంజూరు కాగా మంగళవారం ఒక్కరోజే 650 మంది హాజరయ్యారు. మొత్తం 1200 దరఖాస్తులు రాగా సోమవారం కొందరు హాజరయ్యారు. దీంతో యూనిట్లు అరకొరగా మంజూరు చేశారని, పలుకుబడిన నేతల తాలూకా వారికి తప్ప సామాన్యులకు ఈ రుణాలు ఏం దక్కుతాయంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.
– నూజివీడు

తనుశ్రీకి మద్దతుగా మహిళల ధర్నా



వడాలి సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

ముదినేపల్లి రూరల్: భర్త బెజవాడ అనిల్ వేధింపులు తాళలేక మృతి చెందిన తనుశ్రీకి మద్దతుగా మహిళలు మంగళవారం భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. వడాలికి చెందిన గుండాబత్తిన తిరుపతి కుమార్తె తనుశ్రీ ఆత్మహత్యకు పాల్పడడంపై స్థానిక పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తనుశ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు. మృతదేహంతో తనుశ్రీకి మద్దతుగా గ్రామంలోని మహిళలు, యువకులు గుడివాడ-బంటుమిల్లి రోడ్డులో వడాలి సెంటర్లో ధర్నా నిర్వహించారు. తనుశ్రీ ఆత్మహత్య చేసుకోలేదని, భర్త అనిల్ హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని ఆరోపించారు. మూడు గంటలకు పైగా ముదినేపల్లి - బంటుమిల్లి రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పోలీసులు అన్నవరం, దేవరం, శ్రీహరిపురం మీదుగా సింగరాయపాలెం వైపు ట్రాఫిక్ మళ్లించారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ పవన్‌కుమార్, ఎస్సై వీరభద్రరావు నచ్చచెప్పినప్పటికీ ఆందోళనకారులు వినలేదు. అనంతరం ఫోన్లో డీఎస్పీ తనుశ్రీ కుటుంబీకులతో మాట్లాడి నిందితుడిని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి పంచాయతీ పరిధిలోని గెద్దళ్లవంపు గ్రామానికి చెందిన బందన హేమలత (26) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హేమలతకు అదే గ్రామానికి చెందిన రమేష్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లిన భర్త రమేష్ పదిరోజుల క్రితమే గ్రామానికి వచ్చాడు. వీరికి ఒక పాప ఉంది. ఏమైందో ఏమోగాని మంగళవారం సాయంత్రం హేమలత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హేమలత మరణానికి ఆమె భర్త, కుటుంబ సభ్యులే కారణమని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. మొగల్తూరు ఎస్సై జి వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓఎన్‌జీసీ రిగ్గు వద్ద గ్యాస్ లీకేజీ



డమ్మీ వేసిన వాల్వుల నుంచి లీకవుతున్న గ్యాస్

భీమవరం అర్బన్: నాగేంద్రపురంలో ఓఎన్‌జీసీ రిగ్గు వద్ద మంగళవారం సాయంత్రం గ్యాస్ లీకేజీ కావడంతో స్థానికులు భయాందోళనలు చెందారు. ఏడాదిన్నర క్రితం గెయిల్ సంస్థ ఆ రిగ్గు లోంచి గ్యాస్, ముడి చమురు నిక్షేపాలు ఎక్కువగా ఉండటంతో పైపులైన్ ద్వారా కాకినాడ శుద్ధికర్మాగారానికి తరలించి గ్యాస్ నిక్షేపాలు తగ్గిపోవడంతో వాల్వులకు డమ్మీలు చేసి వెళ్లి పోయారు. మంగళవారం డమ్మీలు వేసిన వాల్వుల నుంచి గ్యాస్ బయటకు రావడంతో స్థానికులు భయాందోళనలతో పరుగులు పెట్టారు. స్థానికులు గెయిల్ సంస్థ ప్రతినిధులకు సమాచారం అందించడంతో వెంటనే వారు వచ్చి గ్యాస్ లీకేజీ రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రూరల్ ఎస్సై ఐ వీర్రాజు తన సిబ్బందితో గ్యాస్ లీకేజీవైపు ఎవరినీ వెళ్లనీయకుండా పహరా కాసారు.

రొయ్య రైతులను ఆదుకోండి

ఏలూరు (టూటౌన్): వ్యాపారులు సిండికేట్‌గా మారి దిగుమతి సుంకం సాకు చూపి అమెరికాకు ఎగుమతి కాని రొయ్యలను సైతం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం అన్నే భవనంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న అమరావతిలో జరిగిన రొయ్యల రైతులు, ఎగుమతిదారులు, వ్యాపారుల సమావేశంలో 100 కౌంట్ ధర రూ.220 కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిందని, అయితే మిగతా కౌంట్‌ల ధర ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. 100 కౌంట్ ధరతో పాటు 90, 80, 70, 60, 50, 40, 30 కౌంట్‌ల ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రొయ్యల రైతుల ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని శ్రీనివాస్ తెలియజేశారు.

బ్యాంకుల వద్దే నిఘా.. అదును చూసి చోరీ

- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ. 5 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కే.ప్రతాప శివకిషోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్

ఏలూరు టౌన్: బ్యాంకుల వద్ద నిఘా వేస్తారు.. డబ్బులు డ్రా చేసుకుని వెళ్లేవారిని వెంబడించి అదును చూసుకుని సొమ్ము కాజేస్తారు. ఈ దొంగల ముఠాను ఏలూరు త్రీటౌన్ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. నిందితులు ఎన్‌టీఆర్ జిల్లా మైలవరం మండలం వీటీసీ ప్రాంతానికి చెందిన షేక్ గాల్సిద్ అలియాస్ సాహిద్, అదే మండలం చిలుకూరివారిగూడానికి చెందిన బొంతు రాజశేఖరరెడ్డి అలియాస్ అములగా గుర్తించారు. మంగళవారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ వివరాలు వెల్లడించారు. ఏలూరు త్రీటౌన్ పరిధిలో బ్యాంకులో డబ్బులు విత్‌డ్రా చేసి వాటిని స్కూటీ డిక్కీలో పెట్టుకుని వెళ్తుండగా మార్గమధ్యంలో ఏదైనా పని నిమిత్తం ఆగితే స్కూటీ డిక్కీల్లోని సొమ్మును అపహరించుకుపోతున్నారు. ఈ చోరీలపై ఏలూరు త్రీటౌన్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏలూరు సీసీఎస్ సీఐ రాజశేఖర్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం పెదపాడు వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా సాహిద్, అముల్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుండి రూ. 5 లక్షల నగదు, పల్సర్ మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదనలో ప్రతిభ చూపిన త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, సీసీఎస్ సీఐ రాజశేఖర్, త్రీటౌన్ ఎస్సైలు రాంబాబు, అప్పారావు, హెచ్‌సీ ఓంప్రకాష్, సీసీఎస్ సిబ్బంది అహ్మద్, రాజ్‌కుమార్, రజని, రామకృష్ణను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

పాత నేరస్తుడిపై పీడీ యాక్ట్

తణుకు అర్బన్: తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు అద్దంకి వెంకన్న అలియాస్ రోలెక్స్‌పై పీడీ యాక్ట్ తెరచి రాజమండ్రి సెంట్రల్ జైలుకి తరలించినట్లు తణుకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన దువ్వలోని సూర్యభగవాన్ ఆలయ ప్రాంతంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలను భయభ్రాంతులకు గురిచేసిన ఘటనకు సంబంధించి వెంకన్న ఇప్పటి వరకు తణుకు సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడని తెలిపారు. మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, గతంలో 4 కేసుల్లో ముద్దాయిగా ఉండడం, నేర చరిత్ర కలిగిన వ్యక్తి కావడంతో కలెక్టర్, ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం మంగళవారం తణుకు సబ్ జైలు నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు వివరించారు.

క్లుప్తంగా

మహిళలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి



మాధవరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు విధిగా పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కే.శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పోషకాహారం, పాలు, గుడ్లు వంటి విధిగా తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వి.కనకమహాలక్ష్మి, టి.అంజి కుమారి, టి.రామలక్ష్మి, కే.సునీత, బి.శైలజ కుమారి, వి.తులసీ కోమలి పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వావసు నామ సంవత్సరం చైత్రమాసం, ఏకాదశి సందర్భంగా స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో లక్ష్మీనారాయణ స్వామికి పంచామృతాలతో, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో విశేష పూజలు జరిగాయి. విశేష అలంకరణలు గావించారు. ఈ పూజలలో ఆర్యవైశ్య నాయకులు నున్న బాల త్రిపుర సుందరరావు, భోగవల్లి రమేష్ తదితరులు పాల్గొని, పూజలు నిర్వహించి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

30 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు



తణుకులో ఉచిత వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన వైద్యశిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు 30 మంది వృద్ధులకు వైద్యసేవలందించి, వృద్ధులు తీసుకోవాల్సిన ఆహార నియమాలు తెలిపి వైద్య సలహాలు అందజేశారు. శిబిరానికి హాజరైన వృద్ధులకు సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. తణుకు శాఖ కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, మద్దా అలివేలు మంగ, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో రాణించాలి



గూడెం నన్నయ్య ప్రాంగణంలో విద్యార్థినికి భోజనం తినిపిస్తున్న వీసీ ఎస్.ప్రసన్నశ్రీ

తాడేపల్లిగూడెం: బిడ్డలను చదివించడంలో తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నతవిద్యలో రాణించాలని నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్.ప్రసన్నశ్రీ కోరారు. మంగళవారం గూడెం నన్నయ్య ప్రాంగణాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రాంగణం, కార్యాలయాలు, సిబ్బంది హాజరు. పనితీరుపై ఆరా తీశారు. విద్యార్థులు ఉన్నతిని దృష్టిలో ఉంచుకొని అధ్యాపకులు విద్యను బోధించాలన్నారు. సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం మహిళా వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ముద్దలు తినిపిస్తూ వారితో కలిపి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ టి.అశోక్ పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలలో విద్యార్థుల ప్రతిభ

అత్తిలి: స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈనెల 5వ తేదీన వియవాడకు చెందిన డ్రీం యంగ్ చిల్డ్రన్ అకాడమి, ఫైనాన్స్ ఫౌండేషన్ ట్రస్టు, ఏపీ అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో పి నవ్య బంగారు పథకం, బీకే లక్ష్మణ్ సిల్వర్ పథకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీపీ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు వేసిన చిత్రాలను అమరావతి ప్రదర్శనలో చిత్రలేఖన ఉపాధ్యాయులు అమర్‌మిత్రా చిత్రాలను ప్రదర్శించారని చెప్పారు. విద్యార్థులందరికీ ప్రసంసా పత్రాలు అమర్ మిత్రా అందజేశారు.

చిట్టడవుల్లా ఖాళీ స్థలాలు

- ఏపుగా ఎదిగిన పిచ్చిమొక్కలు
- విషజంతువుల కలకలం
- పందుల స్వైరవిహారం



మునిసిపల్ పాఠశాల వద్ద అడవిలా మారిన ఖాళీ స్థలం

తణుకు అర్బన్: మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా ఎదిగిపోయి విషజంతువులకు ఆవాసంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధానికి నిలయంగా మారుతున్నాయని తద్వారా దోమల విజృంభణ పెరిగిందని వాపోతున్నారు. అంతేకాకుండా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, వృక్షాలు భారీగా పెరిగిపోవడంతో విషసర్పాలకు నిలయాలుగా మారాయని, ఆనుకుని ఉన్న భవనాల్లోకి సైతం విషసర్పాలు గోడలపై నుంచి పాకుతూ ప్రవేశిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పల్లంగాఉన్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ చేరి దుర్గంధంగా మారాయని స్థానికంగా దుర్వాసనతో ఉండలేకపోతున్నాయని వాపోతున్నారు. మురికి నీటికి తోడు పందులు స్వైరవిహారం చేయడంతో ఎటువంటి రోగాలు వస్తాయోనని స్థానిక ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దోమలకు ఆవాసంగా..

పట్టణంలో ఖాళీస్థలాల యజమానుల నిర్లక్ష్యం కారణంగా ఆయా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగిపోయి, మురికినీటితో నిండి ఉండడంతో దోమలకు ఆవాసంగా మారాయి ఈ ఖాళీ స్థలాలు. పగలు రాత్రి తేడాలేకుండా దోమలు బాధిస్తున్నాయని ఈ ఖాళీ స్థలాల చెంత ఉన్న నివాసితులు ఆందోళన చెందుతున్నారు. దోమలదాడితో బయటకు రావాలంటేనే భయపడుతున్నామని, చిన్నారులను దోమల బారినుంచి ఏరకంగా రక్షించుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. తణుకులోని బ్యాంకు కాలనీ, ఆంధ్రాసుగర్స్ లే అవుట్, సజ్జాపురం, హౌసింగ్ బోర్డు కాలనీ, పాతవూరు, ఇరగవరం కాలనీల్లో ఈ సమస్యల తీవ్రస్థాయిలో ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

> **మురికికూపాలుగా ఖాళీ స్థలాలు**
>
> ప్రైవేటు ఖాళీ స్థలాలు అడవుల మాదిరిగా మారి మురికికూపాలుగా ఉన్నాయి. మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా ఖాళీ స్థలాలను యజమానులు అడవుల్లా తయారుచేస్తున్నారు. స్థానికంగా ఉన్న మాకు ఈ ఖాళీ స్థలాల వలన విష జంతువులు, దోమల బెడదతో బాధపడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.
>
> – ఎ.శ్రీనివాస్, తణుకు



తణుకు బొమ్మలవీధి నంబరు 14 మునిసిపల్ పాఠశాల వద్ద దుర్గంధంగా మారిన ఖాళీ స్థలం



తణుకు బ్యాంక్ కాలనీ వద్ద పార్కు ఎదురుగా పిచ్చిమొక్కలతో ఖాళీ స్థలం దుస్థితి



తణుకు పాలవర్తక సంఘం రోడ్డులోని ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే ఉపసంహరించుకోవాలి



తణుకులో పెంచిన గ్యాస్ ధరలకు నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధర తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బ్యాంక్ కాలనీలో పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇష్టమొచ్చినట్టు ధరలు పెంచడం వ్యతిరేకించాలని, పేదలపై భారాలు వేస్తూ పెద్దలకు రాయితీలు ఇవ్వడం సిగ్గుచేటని స్పష్టం చేశారు. ఇప్పటికే పెరిగిన ధరలుతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరలు పెరుగుతున్నట్టు ప్రజల ఆదాయలు పెరగడం లేదన్నారు. ఎక్కువ శాతం ప్రజలు రోజువారీ అవసరాలకోసం అప్పులు చేస్తూ కుటుంబాలు పోషించకుంటున్నారని ప్రజల్లో కొనుగోలు శక్తి పూర్తిగా క్షీణించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ అయిల్ ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకుండా పెంచడం బీజేపీ దోపిడీకి నిదర్శనమని విమర్శించారు. కాకులను కొట్టి గెద్దలకు వేయడం బాధాకరమని, పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని లేకుంటే ఆందోళనలతో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుబ్బల గోపి, అందే శ్రీనివాస్, అమిరుద్దీన్, చిట్టిబాబు, కర్రి బాలాజీ, మురళి, మారియ్య, టి. మల్లేశ్వరావు, సీతారాం, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతా

- అధిష్టానం ఆదేశాలను శిరసావహిస్తా
- వైఎస్సార్ సీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగేశ్వరరావు (నాగు)



గుండుబోగుల నాగేశ్వరరావు (నాగు)

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్ సీపీ లోనే కొనసాగుతానని పార్టీ అధిష్టానం ఇచ్చే ఆదేశాలను అనుసరిస్తానని వైఎస్సార్ సీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగేశ్వరరావు (నాగు) తెలిపారు. మంగళవారం ఆయన స్వగృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతం నుంచి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వెంట ఉన్నామని, స్థానికంగా గత 30 ఏళ్ల నుంచి కొట్టు సత్యనారాయణ వర్గంగా పార్టీకి సేవలందించామన్నారు. కొట్టు సత్యనారాయణను ఇప్పటికీ తాము గాడ్‌ఫాదర్‌లానే భావిస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో పార్టీ బలోపేతానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని త్వరలో కలసి చర్చిస్తామన్నారు. ఆయన సూచనల మేరకు భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామని నాగు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



అత్తిలి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

అత్తిలి: స్వచ్ఛ ఆంధ్రలో కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం కూడా అంతర్భాగమని, ఇందుకు అనుగుణంగా ఫ్రైడే డ్రైడే ప్రోగ్రాంపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఆశా కార్యకర్తలు మరితం కృషిచేయాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె నాగరాజు ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వారం రోజులు పైబడి ఉన్న నీటి నిల్వలను తొలగించుకోవడం, డ్రైయిన్‌లలో చెత్తను వేయకుండా ఉండటం ద్వారా దోమ పుట్టుక నివారించవచ్చని అన్నారు. చెత్తను డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలని, ప్రజలకు ప్రామాణికంగా వివరించాల్సిన బాధ్యత గ్రామ ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులపై ఉందన్నారు. గుర్తించిన మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్‌ను వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో అప్లోడ్ చేసి, సంబంధిత శానిటేషన్ సెక్రటరీకి తెలియజేయాలని తెలిపారు. ఫీవర్ సర్వే నిరంతర ప్రక్రియ అని అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళి, ఎంపీహెచ్ఈఓ ప్రసాద్, ఆశా నోడల్ ఆఫీసర్స్ అమ్మాజీ, సుశీల, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరాజు, జైరాజ్, ఆరోగ్యకార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

తెగిపడిన విద్యుత్ వైర్లు



తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామం వద్ద ధాన్యం లారీపై పడిన తాటిచెట్టు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో పలు చోట్ల మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం 5.30 గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి వర్షం కురిసింది. దీంతో వీచిన చల్లని గాలులకు ప్రజలు ఎండ తీవ్రత నుంచి సేద తీరారు. కొద్దిపాటి వర్షమైనా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆనందించారు. మరో పక్క వాతావరణం మార్పుతో రబీ ధాన్యం రైతులు ఉలిక్కిపడ్డారు. రహదారుల వెంబడి ఆరబెట్టిన ధాన్యంపై బరకాలు కప్పుకునే పనిలో రైతాంగం నిమగ్నమైంది. అయితే ఎటువంటి వర్షం కురవకపోవడంతో రైతాంగం ఊపిరి పీల్చుకుంది. కాగా, మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో తాటి చెట్టు విరిగి విద్యుత్ లైన్‌తో పాటు అక్కడే నిలిపి ఉంచిన లారీపై తాటి చెట్టు పడింది. అయితే, విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. లేకుంటే ఆస్తి, ప్రాణనష్టం సంభవించి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. ఈ వర్షం ప్రభావంతో బుధవారం వాతావరణం ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోరిమిల్లిలో ముగిసిన సువార్త సభలు

పెంటపాడు: దేవుని ప్రేమకు విధేయులై, ఆయన రాకడకు ప్రతీ ఒక్కరూ సిద్ధపడాలని దైవసేవకులు జి. డేనియల్ జిత్రో(వైజాగ్) పేర్కొన్నారు. దైవసేవకులు మల్లిపూడి ఒనేసిం, అరుణ ఒనేసిమ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కోరిమిల్లిలో ఏసుక్రీస్తు ప్రార్థనామందిరంలో ఏసయ్య సువార్త పండుగలు మంగళవారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా జిత్రోతో పాటు పలువురు సేవకులు ప్రసంగించారు. జి. ఐజయ్య (బిట్రగుంట) తదతరులు దేవునివాక్యం అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు: మండలంలో దర్శిపర్రు ఆర్‌బీకే వద్ద మంగళవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యం అమ్ముకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ కోలా శేషవేణి మాట్లాడుతూ తమ గ్రామానికి వచ్చేందుకు గోతులు పడిన రహదారి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు, ఏవో సారధి, ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం, కూటమి నాయకులు, వీపీఏలు పాల్గొన్నారు.

82 మందికి కంటి వైద్యపరీక్షలు

పెంటపాడు: మండలంలోని మీనవిల్లూరు రామకృష్ణ సేవాట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం 82 మందికి ఉచిత కంటి వైద్యపరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి పాస్టర్ డీఆర్కే మోజస్ (డీవీ కృష్ణ) ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరి, రామకృష్ణ లయన్స్ కంటి వైద్యులు పరీక్షలు చేశారు. వారిలో కంటి లోపాలు ఉన్న 20 మందిని గుర్తించి శస్త్రచికిత్సలకు తరలించారు. మరో 10 మందికి కంటి లోపాలు ఉన్నవారిని గుర్తించి, వారికి పాస్టర్ కృష్ణ ఆధ్వర్యంలో ఉచితంగా రూ.700 విలువైన కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డీవీ మహేష్, ఏసయ్యప్రార్థనామందిర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు మండలం వేల్పూరు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ తాడేపల్లిగూడెం డివిజన్ డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. వేల్పూరు, వీరభద్రపురం, రేలంగి, కావలిపురం, యర్రాయిచెర్వు, కొమరవరం, మహాలక్ష్మిచెర్వు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు తమ ఇళ్లల్లోని తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలని ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో తడి, పొడి చెత్తలను వేరు చేసే ప్రక్రియను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ వెంకటేష్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వడం వల్ల చెత్త నుంచి సంపద సృష్టి సులభతరం అవుతుందన్నారు. తద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పంచాయతీ పారిశుద్ధ్యానికి ప్రజలంతా సహకరించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ ములకాల సూర్యారావు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

కవి ప్రసాద్‌కు ఉగాది పురస్కారం

తణుకు అర్బన్: ఉగాది పురస్కరించుకొని గుంటూరులో ఇటీవల నిర్వహించిన కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ. ప్రసాద్ ఉగాది పురస్కారం అందుకున్నారు. నేటి ఉగాది అనే శీర్షికతో కవితను రచించి, చదివి వినిపించిన ఆయనను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పొత్తూరి సుబ్బారావు ఆధ్వర్యంలో తనకు ఉగాది పురస్కారం దక్కినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తూములూరి రాజేంద్రప్రసాద్, గుంటూరు ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ యశస్వి రమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలకు ఇచ్చిన అన్ని హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, ముఖ్యంగా ఇళ్ల స్థలాలపై ఎన్నికలలో ఇచ్చిన హామీ తప్పక నెరవేర్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు వెల్లడించారు. పట్టణంలో 1, 2, 3 వార్డులలో ఇళ్ల స్థలాల సాధన కమిటీలను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన నిరసన కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వడ్డాది మేరీ, నాగరాజు, నాగలక్ష్మి, నిమ్మకాయల విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపాలెంలో ఎక్సైజ్ తనిఖీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్య లక్ష్మి మంగళవారం తెలిపారు. అతని వద్ద నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గూడెం ఫెయిత్ చర్చిలో యూపీఏ సమావేశం

పెంటపాడు: యునైటెడ్ పాస్టర్ అసోషియేషన్ (యూపీఏ) నియోజకవర్గ సర్వసభ్య సమావేశం బుధవారం కొండాయిచెర్వు ఫెయిత్‌చర్చిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు సంఘ సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్



న్యాయమూర్తి డి.సత్యవతి



అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా

తణుకు అర్బన్: తణుకు కోర్టులో మే10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. తణుకు కోర్టులోని న్యాయమూర్తి హాల్‌లో మంగళవారం జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రాజీపడదగ్గ క్రిమినల్‌కేసులతో పాటు చెక్కు బౌన్స్, బ్యాంక్ బకాయి, ప్రామిసరి నోటు బకాయి, మనోవర్తి, డొమెస్టిక్ వయొలెన్స్, అన్ని రకాల సివిల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ కోర్టులో ప్రీ సిట్టింగ్‌ల ద్వారా, మీడియేషన్ కౌన్సిలింగ్ ద్వారా కూడా కేసులు రాజీ చేస్తున్నామని కక్షిదారులు సద్వినియోగపరచుకుని తమ కేసుల నుంచి పరిష్కారం పొందాలని కోరారు. ముఖ్యంగా సివిల్ కేసులు రాజీ చేసుకొనుట వలన కోర్టుకు కట్టిన కోర్టు ఫీజు తిరిగి తీసుకునే అవకాశం ఉందని, లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకొనుట వల్ల విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని సూచించారు. రాజీయే రాజ మార్గము అనే నినాదం ద్వారా కేసులు రాజీ చేసుకుని ప్రశాంతంగా జీవించవచ్చని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం కోసం న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, మండల న్యాయసేవల కమిటీ సిబ్బంది ద్వారా కేసులు ఎలా రాజీ చేసుకోవచ్చో కక్షిదారులు తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు మే 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా వెల్లడించారు. పట్టణంలోని కోర్టు భవనాల సముదాయం వద్ద ఆయన మాట్లాడుతూ రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటారు వాహన కేసులు, ప్రమాద బీమా కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు మెయింటెనెన్స్ కేసులు రాజీపడవచ్చునని, కక్షిదారులు రాజీ మార్గం ద్వారా రాజీ చేసుకొనవచ్చునని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. డబ్బు, సమయం వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకొని, కేసుల నుంచి విముక్తి పొందాలని కోరారు.

నాగేశ్వరరావు సేవలు మరువలేనివి



మద్దాల నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అత్తిలి: మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వర్గీయ మద్దాల నాగేశ్వరరావు 4వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం అత్తిలిలో నిర్వహించారు. అత్తిలి కాలువగట్టుపై ఉన్న మద్దాల నాగేశ్వరరావు విగ్రహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ మద్దాల నాగేశ్వరరావు ఎంపీపీగా, ఏఎంసీ చైర్మన్‌గా, సొసైటీ చైర్మన్‌గా ప్రజలకు సేవలు అందించారన్నారు. గ్రామాభివృద్ధికి విశేషంగా పాటుపడిన వ్యక్తి మద్దాల అని శ్లాఘించారు. అత్తిలి డిగ్రీ కళాశాల, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మండపం అభివృద్ధికి ఎంతో కృషిచేసారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభసూరిబాబు, మద్దాల బాపిరాజు, సతీష్, నాగరాజు, చినబాబు, మద్దాల రత్నకుమార్, కుక్కల రమణ పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి తెప్పోత్సవం



బైరాగిమఠంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు గోపాలస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు సందర్భంగా మంగళవారం రాత్రి ఆలయం వద్ద ఉన్న కృష్ణాపుష్కరిణిలో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అర్చకులు త్రిలోచన దాసు, పూర్ణచంద్రత్రిపాఠిల బ్రహ్మత్వంలో ఉదయం స్వామివార్లకు నిత్యార్చనలు, విశేషపూజలు చేశారు. అనంతరం రాత్రి 7 గంటలకు విద్యుత్ దీపాలతో అలంకరించిన హంసవాహనంలో స్వామివారికి ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు.